
# జూన్ 10న గంగవరంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర మహాసభ

* ఆదివాసీ హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తాం
* రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను



**గంగవరం, పెన్ పవర్, జూన్ 2 :** ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, చట్టాల పరిరక్షణ, సాంస్కృతిక విలువల సంరక్షణ లక్ష్యంగా పనిచేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర మహాసభలను ఈ నెల 10వ తేదీన పోలవరం జిల్లా గంగవరం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను ప్రకటించారు. మహాసభల ఏర్పాట్లపై మంగళవారం గంగవరంలో జిల్లా కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, తొలుత రాష్ట్ర మహాసభలను శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల గంగవరం కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఆదివాసీ సంక్షేమ పరిషత్ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నంబర్-3 సాధనలో పరిషత్ కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే రాజకీయ పార్టీల వైఫల్యం, వలస నాన్-ట్రైబల్స్ కుట్రల కారణంగా 2020లో సుప్రీంకోర్టు జీవో నంబర్-3ను రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్-3 స్థానంలో ప్రత్యేక ఉద్యోగ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలను ఏకం చేసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని కుంజ శ్రీను స్పష్టం చేశారు. 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం, రాజకీయ రిజర్వేషన్ల అమలులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాటాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జూన్ 10న జరిగే రాష్ట్ర మహాసభలకు ఆదివాసీ ప్రజలు, మేధావులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉమ్మడి పోలవరం-అల్లూరి సీతారామరాజు జిల్లాల అధ్యక్షుడు తీగల బాబురావు, రంపచోడవరం డివిజన్ అధ్యక్షుడు మోడీద నూకరాజు, డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, పీట ప్రసాద్, కంగాల అబ్బాయి దొర, చోడి ఏడుకొండలరావు, కలుముల ప్రసాద్ దొర, పరద శివరామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థికి ఎమ్మెల్యే బొలిశెట్టి రూ.10వేలు ఆర్థిక సహాయం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 02:** ప్రతిభావంతుడైన విద్యార్థికి శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ రూ.10,000లు ఆర్థిక సహకారం అందించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు గ్రామానికి చెందిన దూడల సత్యవతి కుమారుడు చరణ్ శ్రీ సాయి విద్యార్థి పెంటపాడు ప్రభుత్వ పాఠశాలలో చదివి,10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రథమ స్థానం, పెంటపాడు మండల స్థాయిలో తృతీయ స్థానం సాధించాడు. స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే విద్యార్థిని దూడల చరణ్ శ్రీ సాయి అభినందించింది, ఆర్థిక సహకారం అందించారు. వైతమ కుమారునికి ఆర్థిక సహకారం అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి కి విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

# సుజనా చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు బిజెపి మాజీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి..!



**కోరుకొండ,పెన్ పవర్, జూన్ 2:**
హైదరాబాద్ లో మాజీ కేంద్ర మినిష్టర్, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరికి రాజానగరం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల వీరన్న చౌదరికి ఎమ్మెల్యే సుజనా చౌదరికి దశాబ్దాల కాలం నుంచి సన్నిహిత్య సంబంధాలు ఉన్నాయి. అంతేకాకుండా కుటుంబ బంధుత్వం కూడా ఉండడంతో వీరిద్దరూ ఆత్మయంగా కలుస్తూ ఉంటారు. కాగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా హైదరాబాద్ వెళ్లిన నీరుకొండ వీరన్న చౌదరి మంగళవారం సుజనా చౌదరి కార్యాలయనికి వెళ్లి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కొంతసేపు ఇద్దరు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరన్న చౌదరి సన్నిహితులు, బంధువులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ ఎంపికైన ఎస్‌జీటీలకు ప్రత్యేక శిక్షణ



* ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల నమోదు పెంచాలి
* డీడీ రుక్మండయ్య

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 2 :** మెగా డీఎస్సీ ద్వారా ఎంపికై పోలవరం జిల్లాలో ఎస్‌జీటీలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు 2026-27 విద్యా సంవత్సరాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బొర్లగూడెం డైట్ కళాశాలలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య ఆధ్వర్యంలో పీఎంఆర్సీ సిబ్బంది ఈ ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని 12 మండలాలకు చెందిన సుమారు 116 మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య మాట్లాడుతూ, పాఠశాల వయస్సు కలిగిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలలో ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉపాధ్యాయులు తమ సర్వీస్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ బి.ఎస్. కుమార్ సేవా నియమాలు, పాఠశాల నిర్వహణపై అవగాహన కల్పించగా, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ముంగారి చిన్నబాబు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన పద్ధతులు అనుసరించాలని వివరించారు. కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ జల్లి శంభుడు, ఏటీవో చిన్నబాబు, సీఎంఓ మంగిరెడ్డి, సూపర్ ఫిఫ్టీ సూపర్‌వైజర్ బోన్ల వరప్రసాదరావు, డీసీడీవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

# రూ.23 లక్షలతో ఆధునీకరించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభం



**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జూన్ 2:** ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్తులను తిరిగి ప్రజల సేవకే వినియోగించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. రూ.23 లక్షల వ్యయంతో 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో ఆధునీకరించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ హాల్స్‌ను సచివాలయాలుగా మార్చడం వల్ల బలహీన వర్గాల ప్రజలు , శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశాలు కోల్పోయారన్నారు. కమ్యూనిటీ హాల్స్‌ను తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. 49వ డివిజన్ యండీస్‌పేట లో కూడా కమ్యూనిటీ హాల్‌ను అందుబా టులోకి తేచ్చామన్నారు. బైబిల్ ప్యాలెస్ చర్చి నుంచి సాయిబాబా ఆలయం మీదుగా ఆర్ట్స్ కాలేజ్ వరకు రహదారి అభివృద్ధికి రూ.1.80 కోట్ల ఎన్‌క్యాప్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. స్థానిక రామాలయం పునర్నిర్మా ణానికి రూ.45 లక్షల నిధుల ప్రతిపాదన క్లియర్ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నక్కా చిట్టిబాబు, దొండపాటి సత్యబాబు, గుత్తుల రమేష్, జక్కంపూడి అర్జున్, యాళ్ల శ్రీను, డైరెక్టర్ గూటాల సంజీవరావు, బొట్ట వీరబాబు, కొండిశెట్టి రామకృష్ణ, అల్లంకి మణికంఠ, దార రాజు, మొత్తికి మురళీకృష్ణ, గుంటముక్కల కుమార్ వేగు, వెంకటరమణ, అప్పారావు, రాజి, లలిత, మహాలక్ష్మి, ఉమా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు ఖాళీ స్థలాల, ట్రాఫిక్ ప్రణాళికలపై కలెక్టర్ సమీక్ష







**పుష్కరాలపై అమరావతి నుంచి సీఎం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 2 :** గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణపై మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి , ఎస్పీ డి నరసింహ కిషోర్ జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఇతర అధికారులు బొమ్మూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. జిల్లాలో చేపడుతున్న పుష్కరాల సన్నద్ధత పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్య మంత్రికి వివరించారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారన్నారు. పుష్కరాల కోసం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి గోదావరి పరివాహక ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా నిలవాలని సూచించారు. నగరాన్ని మెగా సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందిం చాలన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ క్షేత్రస్థాయి పర్యటనలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగర పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి పుష్కరాలలో వాహనాల పార్కింగ్, తాత్కాలిక వసతి కేంద్రాలకు ఈ స్థలాలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలన్నారు.
జిల్లాలో ప్రతిపాదిత 16 పుష్కర్ నగర్‌ల లేఅవుట్ ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై పోలీసు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నేషనల్ హైవే శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి రహదారుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి-16పై వాహనాల రద్దీ సమాచారాన్ని సేకరించి, పుష్కరాలలో ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను రూపొందిం చాలన్నారు. పుష్కర్ నగర్‌ల నుంచి ఘాట్ల వరకు షటిల్ బస్సుల నిర్వహణ, ప్రవేశ-నిష్క్రమణ మార్గాల రూపకల్పన, భక్తుల రాకపోకలకు రవాణా సౌకర్యాలపై ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల నిర్వహణలో ప్రతి శాఖ నిర్దేశిత గడువుల్లో పనులు పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ పుష్కరాల కు లక్షలాది భక్తులు జిల్లాకు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవల సమన్వయంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. పుష్కర ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల వద్ద భద్రతా చర్యలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.
ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఇన్‌చార్జి డీఆర్వో ఎస్. భాస్కర్ రెడ్డి, జిల్లా అధికారులు కే లక్ష్మీ నారాయణ, ఆర్. సురేష్, వి.వి. గిరి, వి. శాంతామణి, పి. వీణాదేవి, ఎస్‌బీవీ రెడ్డి, మార్టిన్ లూథర్ కింగ్, ఎన్. నిర్మలా కుమారి, టౌన్ ప్లానింగ్ అధికారి మూర్తి, ఎండీ మదర్సా అలీ, వి. వినూత్న, అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టు ప్రతినిధి ఎన్‌వీఎస్ మూర్తి, ఆర్ఎంసీ వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# ప్రత్యేక పాలన..సమస్యలు తీరేనా..!

-మురుగుకు దారి చూపండి.

**ఏలూరు జూన్ 2 పెన్‌పవర్ :** ఐదేళ్ల పంచాయితీ పాలకవర్గాల పదవీకాలం పూర్తి కావడంతో వారి స్దానంలో ప్రత్యేక అధికారులు, పంచాయితీ పాలకవర్గం సభ్యులు ప్రస్తుతం పగ్గాలు చేపట్టారు. వేసవి మొదలైన నాటి నుండి గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మండలంలో కొన్ని చోట్ల ఓహెచ్ఆర్ ట్యాంకులు నిరుపయోగాంగా ఉండటంతో గ్రామస్దులు ప్రత్యామ్నాయ మార్గాలలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. మరో వైపు పారిశుధ్య నిర్వహణ పైన దృష్టిసారించాల్సి ఉంది. పంచాయితీ నిధుల్లో మొదటి ప్రాధాన్యత తాగునీటి సరఫరా,పారిశుధ్య నిర్వహణ, సిబ్బంది జీతాల పేరిట ఖర్చు చేస్తుంటారు. మౌలిక సదుపాయాల కోసం చేసిన ఖర్చు స్వల్పమే. ఆర్దిక సంఘం నిధులు పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యేనాటికి ఆయా పంచాయితీలలో మిగులుగా ఉన్నాయి. గ్రామ పంచాయితీకి ఇంటి పన్నులే ప్రధాన ఆదాయవనరు కాగా,వాణిజ్య సముదాయం నుంచి వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. అయితే ఆర్దిక సంఘం నిధులు సమయానికి వస్తుండడంతో ఎంతో కొంత మిగులు ఉంటుంది. ఈ నిధులను సద్వినియోగం చేసుకుంటే పంచాయితీలకు మేలు జరుగుతుంది.



**డ్రైనేజీలు పూడుకుపోయినా కన్నెతి చూడరు**

ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామం నుండి కోడిగూడెం వెళ్లే రహదారిలో కొమ్మర ఓహెచ్ఆర్‌వద్ద మురుగు రోడ్‌పై తాండవిస్తోందని నివాసితులు, వాహనచోదకులు, ఆవేదన చెందుతున్నారు. కాలువల్లో పూడిక తీయకపోవడంతో ప్లాస్టిక్



వ్యర్దాలతో డ్రైనేజీలలో నిండి స్తంబించి మురు నీరు రోడ్లపై పరుగుపెడుతోంది. కొమ్మర ఓహెచ్ఆర్ వేసవిలో పశువులు తాగేనీటి తొట్టి అపరిశ్రభతకు నిలయంగా మారింది. పంచాయితీ కార్యాలయం పక్కన,పరిసరాల నుండి వచ్చే మురుగు పేరుకుపోయి దుర్వాసన,దోమలతో కంపుకొడుతోందని స్దానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొమ్మరలోని కాలనీలలో సరైన డ్రైనేజి వ్యవస్ద లేక మురుగునీరు రోడ్డు మీదనే పారడంతో అటు వైపుగా వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఈస్ట్,సౌత్ ప్రాంతాలలోడ్రైనేజీలు,పారిశుధ్యం గురించి పట్టించుకున్న అధికారులు,ప్రజా ప్రతినిధులు లేరని ప్రజలు వాపోతున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

